క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో దాసరి నాగయ్య మృతి చెందాడు. ఆయనకు బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో బుధవారం పార్టీ బీమా రూ.2 లక్షల చెక్కును మృతుడి భార్య సునీతకు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నాయకుడు, కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. మృతుడి కుటుంబాన్ని పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, ప్రసాద్, బానోత్ కొండ, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న సంభాని చంద్రశేఖర్, నాయకులు

కల్లూరు రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కల్లూరు మండలంలోని క్రిష్టయ్య బంజర, యజ్ఞనారాయణపురం గ్రామాల్లో జెండా ఆవిష్కరణచేసి, ఇంటింటికి కాంగ్రెస్ కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజలకు సుభిక్ష పాలన అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, కిరణ్ రమేష్, గోపాలరావు, హుస్సైన్ నాయక్ నగేష్, చుక్కా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయంలో పని చేయుటకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గెస్ట్ ప్యాకల్టి నియమాల కోసం ఆంగ్లమాధ్యమంలో అనుభవజ్ఞులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సబ్జెక్ట్ వారిగా ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. అర్హులైన వారు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం గురుకుల విద్యాలయంలో సంప్రదించాలని కోరారు.

టీబీ వ్యాధిపై అవగాహన

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో బుధవారం టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ నిక్షయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా టీబీవ్యాధి నోడల్ అధికారి కె.పెద్ద పుల్లయ్య మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు బండ పార్థ సారధిరెడ్డి అందిస్తున్న టీబీ వ్యాధి కిట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ వై.సురేష్, ఎఎన్‌ఎం త్రివేణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు గ్రామానికి చెందిన యన్నం కోటేశ్వరరావు, రజిని దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆర్‌కే ఫౌండేషన్ అనాథాశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ మాట్లాడుతూ.. అనాథ ఆశ్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న యన్నం కోటేశ్వరావుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోట రాంబాబు, దేవిశెట్టి రంగారావు, యర్రగుంట రమేష్, కంభంపాటి సురేష్, దోర్నాల మణిబాబు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బందెలదొడ్డి భూమి స్వాధీనం

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీకి చెందిన గడిపాడు బందెలదొడ్డి స్థలాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ కె.సుజాత పరిశీలించారు. గోడలు, నీళ్లతొట్టి, రేకులషెడ్‌ను తొలగించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ సంఘటనలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి నోటీసులిస్తున్నామని తెలిపారు. భూమిని కొలతలు వేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని, స్థలంలో నోటీస్‌బోర్డు కూడా పెడతామని తెలిపారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

తల్లాడ: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు క్రమబద్ధీకరణకు కృతజ్ఞతగా కేసీఆర్ చిత్రపటానికి బుధవారం పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎంపీఓ శ్రీదేవి, జూనియర్, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పడిగాపులు



కొణిజర్ల కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్నలపై పట్టాలు కప్పి ఉంచిన దృశ్యం

- రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే
- లారీల కొరతతో నిలిచిన కాంటాలు
- వాతావరణ మార్పులతో రైతుల్లో గుబులు
- బస్తాకు రూ.5 ఇస్తేనే.. వస్తామంటున్న డ్రైవర్లు

అసలే ఎండాకాలం పగలు ఎండలు మండిపోతున్నాయి. సాయంత్రం అయ్యే సరికి ఉరుములు, మెరుపులు వడగండ్లతో వానలు ఈ తరుణంలో పండించిన పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ అనేక కొర్రీలు పెడుతున్నారు. అంతా సవ్యంగా జరిగి కాంటాలు వేసుకుంటే.. బస్తాలు తరలించడానికి లారీలు రాక రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు. పంట పండిందన్న ఆనందం కన్నా దానిని మిల్లులకు తరలించే వరకు పడే ఇబ్బందులే రైతులను వ్యవసాయానికి దూరమయ్యేలా చేస్తున్నాయి.

కొణిజర్ల: కొణిజర్ల మండలంలో సుమారు 18 వేల ఎకరాలలో యాసంగి మొక్కజొన్నలు సాగు చేశారు. ఎకరానికి 25 క్వింటాళ్ల నుంచి దాదాపు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. నవంబర్‌లో విత్తిన రైతులకు మార్చిలో దిగుబడి రావడంతో ప్రైవేట్ వ్యాపారులకు మంచి ధరకే అమ్ముకున్నారు. ఆ తరుణంలో ప్రైవేట్ వ్యాపారులు రూ.2,200 నుంచి రూ.1,900 వరకు క్వింటా మొక్కజొన్నలకు ఖరీదు ఇచ్చి కొనుగోలు చేశారు. ఆ తర్వాత యాసంగి పంట రావడంతో ప్రైవేట్ వ్యాపారులు అమాంతం ధర తగ్గించారు. రూ.1,550కు తగ్గించి కొనుగోలు చేశారు. దీంతో రైతులు ఆందోళనకు దిగడంతో ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చింది. మేలు రకం మొక్కజొన్నలు క్వింటాల్‌కు రూ.1,960 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. కొణిజర్ల, తుమ్మలపల్లి, పల్లిపాడు, పెద్దమునగాల, పెద్దగోపతి, సింగరాయపాలెంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎకరానికి 22.6 క్వింటాళ్ల చొప్పునే కొనుగోలు చేసేందుకు ఏఈఓలు కూపన్లు మంజూరు చేస్తుండటంతో రైతులు తమ పంటలను అమ్ముకునేందుకు ఇతర రైతులపై ఆధార పడాల్సి వచ్చింది. ఇన్ని కష్టాలు పడి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే బస్తాలు సరిపడా రాక రైతులు నానా అగచాట్లు పడ్డారు. అకాల వర్షాలకు మక్కలు తడిచి నల్లబడ్డాయి. బస్తాలు వచ్చి కాంటాలు వేసిన తర్వాత ఇప్పుడు కొత్త సమస్య మొదలైంది. కాంటాలు వేసిన బస్తాలను మిల్లులకు తరలించే వరకు రైతులదే బాధ్యత కావడంతో లారీల కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. సొసైటీ, డీసీఎంఎస్ సిబ్బందికి లారీలు పంపించాల్సిన అవసరం ఉన్నా వారు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండటం వల్ల రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఉండాల్సి వస్తుంది.

కేంద్రాల్లోనే రైతుల పడిగాపులు..

కాంటాలు వేసి 15 రోజులు దాటినా ఇంకా బస్తాలు తరలించక పోవడంతో రేయనక పగలనక కంటి మీద కునుకు లేకుండా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంటాలు వేసేందుకు హమాలీలు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అయితే క్వింటాకు రూ.45 తీసుకుంటున్నారు. అదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో రైతు వద్ద మాత్రం క్వింటాకు రూ.60 తీసుకుంటున్నారు. మరో వైపు లారీ డ్రైవర్లు సైతం తమకు బస్తాకు రూ.5 నుంచి 8 వరకు ఇస్తే లారీ తక్షణమే తీసుకొచ్చి లోడు చేయిస్తామని బహిరంగంగానే రైతులతో బేరాలకు దిగుతున్నారు. ఓ వైపు జిల్లా అధికారులు మాత్రం రైతులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడం ప్రకటనలకే పరిమితం అవుతుంది.

ఎనిమిది రోజులుగా రాశుల వద్దే ఉంటున్నా..



4 ఎకారాలలో మొక్కజొన్న సాగు చేయగా 150 క్వింటాలు పండింది. పంటకు కాంటా వేసి ఎనిమిది రోజులు అవుతుంది. ఇప్పటి వరకు లారీలు రాలేదు.. అడిగితే సొసైటీ వారు వస్తారు వచ్చినప్పుడే లారీ లోడు చేయించుకోమని చెబుతున్నారు. వర్షం పడితే పంట తడవకుండా ఇంటిల్లిపాది ఇక్కడే ఉండాల్సి వస్తుంది. అధికారులు మా బాధను పట్టించుకొని త్వరగా లారీలు పంపించి ఆదుకోవాలి.

– దేరంగుల బసవయ్య, రైతు, కొణిజర్ల

బస్తాకు రూ.5 ఇవ్వాలంట..



కొనుగోలు కేంద్రంలో ఈ నెల 15న కాంటాలు వేయించాను. రోజు కొణిజర్ల రావడం, లారీల కోసం సాయంత్రం వరకు పడిగాపులు కాయడం ఇంటికి పోవడం జరుగుతుంది. లారీల కోసం ఫోన్ చేస్తే బస్తాకు రూ.5 బేటా ఇస్తే లారీలు పెడతామని డ్రైవర్లు నేరుగా చెబుతున్నారు. లారీలు రాక కొనుగోలు కేంద్రాల వద్దనే పడిగాపులు కాస్తున్నాం. ఇతర పనులకు పోలేక పోతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

– బానోత్ రవి, రైతు, మల్లుపల్లి

నకిలీ విత్తనాలపై అవగాహన



మధిర: మాట్లాడుతున్న సీఐ మురళి



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

మధిర/సత్తుపల్లిరూరల్/పెనుబల్లి: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు పురుగుమందులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి, ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, సత్తుపల్లి వ్యవసాయ సంచాలకుడు నర్సింహారావు, సీఐ టి.కరుణాకర్, ఎస్సై జి.సూరజ్, వ్యవసాయాధికారి ఏవీఎస్ఎస్ రాజు హెచ్చరించారు. మధిర రైతు వేదికలోని మధిర, బోనకల్, ఎర్రుపాలెం విత్తన డీలర్లకు, సత్తుపల్లి మండలంలోని కొత్తూరు రైతు వేదికలో, పెనుబల్లి రైతు వేదికలో విత్తన, పురుగుమందులు, ఎరువుల డీలర్లుకు వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను అందించాలని కోరారు. విక్రయించిన సరుకుకు సరైన బిల్లులు ఇవ్వాలని తెలిపారు. ఈ విక్రయాలపై వ్యవసాయ, పోలీస్ శాఖ నిఘా ఉంటుందని తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించిన వారిపై తీవ్రతను బట్టి క్రిమినల్ కేసులతో పాటు పిడి యాక్ట్ కూడా నమోదు చేస్తామని స్పష్టం చేశారు. విత్తనాలు, ఎరువుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా ఉంచుకోవాలని కోరారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. వ్యవసాయ శాఖ వారు ధ్రువీకరించిన వ్యాపారుల వద్ద మాత్రమే నాణ్యమైన విత్తనాలను, ఎరువులను కొనాలన్నారు. ఈ సమావేశంలో మధిర టౌన్ అడిషనల్ ఎస్సై స్వప్న, రూరల్ ఎస్సై శ్రీధర్, బోనకల్ ఎస్సై కవిత, ఎర్రుపాలెం ఎస్సై సురేష్, వ్యవసాయ అధికారులు విజయభాస్కర్ రెడ్డి, అనిల్ కుమార్, సింధూర్, వంశీకృష్ణ, నాగసాయి, బాలకృష్ణ, సత్తుపల్లిలోని మండల వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఏఎస్సై జయబాబు, ఏఈఓ టి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు

ముదిగొండ: యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడల్లో మేడేపల్లికి చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. మహిళల ఫుడ్‌బాల్ జట్టులో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన క్రీడల్లో పి.యామిని, ఎం.యువవర్షినిలు ఎంపికైయ్యారని మేడేపల్లి పీఈటీ కృష్ణయ్య తెలిపారు. ఈ విద్యార్థినులను ఎంపీపీ హరిప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు కె.బాగ్యలక్ష్మి, ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ రంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏన్కూరు: క్రీడాకారులకు సన్మానం చేస్తున్న దృశ్యం

క్రీడాకారులకు సన్మానం..

ఏన్కూరు: సీఎం కప్ క్రీడాపోటీలలో జిల్లాస్థాయిలో కబడ్డీ, వాలిబాల్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఏన్కూరు క్రీడాకారులను ఎంపీపీ ఆరెం వరలక్ష్మి బుధవారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, సూపరింటెండెంట్ కృష్ణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ శారద శాంతి

మధిర: బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో ప్రభుత్వ ఆయుర్వేద వెల్ నెస్ సెంటర్‌లో మహిళ, శిశు, వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ బాలుర పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అర్బన్ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే మారుమూల గ్రామాల్లో అక్కడక్కడా బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయని, వాటిని కూడా జరగకుండా ఆశ వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారికి బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. కౌన్సిలర్ కట్టా గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్టివ్ యూనిట్ ఇన్స్టిట్యూషనల్ కేర్ ఆఫీసర్, సీడీపీఓ శారద శాంతి మాట్లాడారు. ఏసీడీపీఓ వీరభద్రమ్మ, సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లు నిర్మల, రాణి, వెంకట కుమారి, ఆయుష్ శాఖ సిబ్బంది కందుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గాలి దుమారానికి కూలిన రేకుల ఇల్లు



గాలిదుమారానికి కూలిపోయిన రేకుల ఇల్లు

కారేపల్లి: గాలి దుమారానికి రేకుల ఇల్లు కూలిపోయిన ఘటన మండలంలోని గుంపెళ్లగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన వాంకుడోతు సునీత రేకుల ఇల్లు బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన గాలి దుమారానికి కూలిపోయింది. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న వాళ్లు బయటికి పరుగులు తీయటంతో ప్రమాదం తప్పింది. వార్డు మెంబర్లు సైదులు, చిన్న, గ్రామ పెద్దలు వీరబాబులు కూలిన ఇల్లును సందర్శించి, ప్రభుత్వం సునీత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

గిరిప్రసాద్ ఆశయాలను కొనసాగిస్తాం

మధిర/సత్తుపల్లిటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు నల్లమల గిరిప్రసాద్ ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ తెలిపారు. గిరిప్రసాద్ వర్ధంతి సందర్భంగా బుధవారం మధిరలోని తొండల గోపవరం గ్రామంలో గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సత్తుపల్లిలో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తన తుదిశ్వాస వరకు ఎర్రజెండా బాటలో నడిచిన మహా మనిషి నల్లమల్ల గిరిప్రసాద్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో శేషగిరి, కొండలరావు, కామేశ్వరరావు, బ్రహ్మం, వెంకటేశ్వరరావు, రామానుజం, అప్పారావు, గోపి, సీతయ్య, కృష్ణ, రమాదేవి, చిట్టెమ్మ, పార్వతి, రామలక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం

చింతకాని: మండలంలోని పాతర్లపాడు గ్రామంలో స్వర్గీయ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంగీత విభావరిని నిర్వహించి ప్రముఖ రంగస్థల నటులు, కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ కార్యదర్శి కేతినేని హరీష్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కృష్ణప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు తాజుద్దీన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న అదనపు డీఆర్డీఓ శిరీష

ఎర్రుపాలెం: ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు ఉపాధి కల్పించే విధంగా పనులు గుర్తించాలని అదనపు డీఆర్డీఓ శిరీష స్థానిక మండలాధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. తొలుత మండలంలోని రామన్నపాలెం, ఇనగాలి, ములుగుమాడు గ్రామాల్లోని నర్సరీలను ఆమె పరిశీలించారు. ప్రగతి నివేదికలను పంపించడంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఏపీఓ కె.నాగరాజు, ఎంపీఈఓ శ్రీలక్ష్మి, ఈసీ విజయ్, టెక్నికల్ అసిస్టెంట్లు విజయలక్ష్మి, కాంతమ్మ, నాగేశ్వరరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోజు కూలి రూ.600 ఇవ్వాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సత్యనారాయణ

తల్లాడ: మండలంలోని పినపాక గ్రామంలో ఉపాధి పనులను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ఉపాధి కూలీలకు బీమా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ నన్నే సాహెబ్, చల్లా నాగేశ్వరరావు, యశోధ, వెంకటేశ్వర్లు, జమలమ్మ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుమాధవ్

బోనకల్: అన్ని గ్రామపంచాయతీలలో దశాబ్ది డీఓ వేణుమాదవ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. కమ్యూనిటీ సోక్‌పిట్‌లను యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శాస్త్రీ, ఏపీఓ కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కిరాణాషాపులో చోరీ

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురం క్రాస్ రోడ్డులో ఉన్న ఓ కిరాణాషాపులో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చిరుమర్రికి చెందిన పల్లపాటి గోపి మూడు సంవత్సరాలుగా సువర్ణాపురం బస్టాండ్ సెంటర్ కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం తలుపులు, తాళం పగలుగొట్టి దుకాణంలోని మద్యంసీసాలు, నగదు, రెండు సీసీ కెమెరాలు, పెట్రోల్, కూల్ డ్రింక్స్ చోరీ చేశారు. ఈ విషయమై ఎస్సై నరేష్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

పాడి గేదెలు మృత్యువాత

మధిర: మండలంలోని రాయపట్నం గ్రామంలో రెండు పాడి గేదెలు మృత్యువాతకు గురయ్యాయి. రెండు రోజుల క్రితం వచ్చిన గాలి దుమ్ముకు పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడింది. దీంతో విద్యుత్‌వైర్లు భూమి మీద ఉన్నాయి. గ్రామానికి చెందిన దాములూరు జాలమ్మ, పార్శపు వెంకయ్యకు చెందిన రెండు పాడి గేదెలు అటువైపు పొలానికి మేతకు వెళ్లాయి. విద్యుత్ వైర్లను తాకడంతో మృతి చెందాయి. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటాయన్నారు. వీటితో పాటు వానరం కూడా చనిపోయిందన్నారు. బాధిత కుటుంబాలకు విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీరు లేక ప్రజల అవస్థలు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో గత నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. గ్రామంలోని పైపులైన్లు తరచూ లీకులు కావడంతో పాటుగా సంప్ వద్ద విద్యుత్ మోటార్లు కాలిపోవడంతో తాగునీటికి ఇబ్బంది కలుగుతుంది. మిషన్ భగీరథ నీరు కూడా అరకొరగానే సరఫరా చేస్తున్నారు. వేసవిలో నీటికోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటర్‌ప్లాంట్‌లో 20 లీటర్లు రూ.10కి చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన శాశ్వత మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

కారేపల్లి: కారేపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని పేరుపల్లి, మాధారం వెళ్లె రైల్వే గేటు (1కెకె లెవల్ క్రాసింగ్) వద్ద మరమ్మతులు నిర్వహిస్తున్న దృష్ట్యా పేరుపల్లి రైల్వే గేటును ఈ నెల 25వ తేదీ నుంచి 27 వరకు మూడు రోజుల పాటు మూసి వేస్తున్నట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన విషయమై రైల్వే అధికారులు తహసీల్దార్‌కు సమాచారం అందించారు. కాగా.. పేరుపల్లి, మాధారం వైపు వెళ్లాల్సిన వాహనాలను ఇల్లందు రైల్వే గేటు (2కెకె లెవల్ క్రాసింగ్) ద్వారా అప్పాయిగూడెం, ఎన్టీఆర్‌నగర్, సూర్యతండా మీదుగా దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

సీనియర్ కాంగ్రెస్ నేత మృతి

మధిర: మండలంలోని చిలుకూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నిడమానూరి అప్పారావు (84) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. గత కొద్దికాలంగా అనారోగ్యానికి గురైన అప్పారావు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ చిలుకూరు గ్రామానికి వచ్చి అప్పారావు భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథం, డాక్టర్ రాంబాబు, నాయకులు నివాళులర్పించారు.

బాలసాహిత్య సమ్మేళనానికి మధుసూదన్‌రాజు



సత్తుపల్లి కవి బి.మధుసూదన్‌రాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిరూరల్: హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో మంగళవారం జరిగిన బాలసాహిత్య సమ్మేళనంలో సత్తుపల్లికి చెందిన కవి బి.మధుసూదన్‌రాజు పాల్గొన్నారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి తన మాతృమూర్తి కోడూరి శాంతమ్మ జ్ఞాపకార్థం ఈ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న బి.మధుసూదన్ రాజు బాలసాహిత్యం నాడు–నేడు అంశంపై ప్రసంగించి సాహిత్య అభివృద్ధికి పలు సూచనలు చేశారు. సమ్మేళనం అనంతరం మధుసూదన్‌రాజును నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో శాంత బయోటెక్ వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, డాక్టర్ పత్తిపాక మోహన్, డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు, గరిపెల్లి అశోక్ పాల్గొన్నారు.

అక్రమ గుడారాలు తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణ శివారులోని సర్వే నంబరు 334లోని 1.30 ఎకరాల స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన గుడిసెలు, గుడారాలను భారీ పోలీస్ బందోబస్తుతో బుధవారం తొలగించారు. జేసీబీలు, డోజర్లతో సుమారు 30 గుడారాలను తొలగించారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాయల పుష్పావతి, రెవెన్యూ శాఖకు ఈ స్థలం వివాదంపై హైకోర్టులో కేసు నడుస్తుందని తెలిపారు. ఈ భూమిలో ఇతరులు వచ్చి అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగించటం జరిగిందని స్పష్టం చేశారు. ఎవరూ భూమిపైకి వెళ్లినా చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. కల్లూరు ఏసీపీ రామానుజం పర్యవేక్షణలో సీఐ టి.కరుణాకర్ ఆధ్వర్యంలో పలువురు ఎస్సైలు, సుమారు 50 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆక్రమణలు తొలగించిన అనంతరం ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న పూజారులు

కొణిజర్ల: మండలంలోని శ్రీమాన్ మహాదేవాలయంలో పర్వత వర్ధిని సమేత మహాదేవ లింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠ జరిగి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా బుధ వారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన పూజారి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జామునుంచే ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం దంపతులచే ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి బోనాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. ఆ తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్వర్ణరమేష్, స్వర్ణ వెంకటి తదితరులు పాల్గొన్నారు.